సాక్షి వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 3 । మార్చి । 2023



జాగ్రత్తలే శ్రీరామరక్ష
వేసవికాలంలో తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. -8లో..



భర్త కోసం మౌన పోరాటం
నా భర్త నాకు కావాలంటూ భాగ్యలక్ష్మి అనే మహిళ అత్త ఇంటి ముందు మౌనపోరాటం చేపట్టింది. -8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.7/19.4
జిల్లాలో గురువారం 19.4 – 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

5న జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 5న జిల్లాస్థాయి రెజ్లింగ్ బాలురు, బాలికల విభాగం చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌ఏ రెజ్లింగ్ శిక్షకుడు ఎస్.మస్తాన్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సోలార్ డ్రోన్ టెక్నాలజీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : సోలార్ డ్రోన్ టెక్నాలజీలో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వారు పులివెందులలో సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో స్కిల్ కాలేజీలో శిక్షణ ఇవ్వనున్నారన్నారు. సోలార్ ఇంజనీర్, డ్రోన్ పైలెట్, సర్వీసు టెక్నిషియన్‌లో ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తారన్నారు. సోలార్ ఇంజనీరుకు డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, డ్రోన్ పైలెట్ సర్వీసు టెక్నిషియన్‌కు ఇంటర్, ఐటీఐ, డిప్లొమా ఉండాలన్నారు. 90 రోజులపాటు శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయంతోపాటు శిక్షణకు అవసరమైన స్టేషనరి, యూనిఫాం, శిక్షణానంతరం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. వివరాలకు 99851 42155, 90005 17637, 99492 46094 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మార్కులు ప్రామాణికం కాదు



మాట్లాడుతున్న పీఓ ప్రభాకర్‌రెడ్డి

ఖాజీపేట : నిజ జీవితంలో విద్యార్థులు రాణించాలంటే మార్కులు ప్రామాణికం కాదని, సున్నితమైన భావాలను వదిలి మనస్తత్వాన్ని వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఖాజీపేటలోని మోడల్‌స్కూల్‌ను ఆయన గురువారం పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజమ్‌కుమార్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



చియ్యపాడులో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

చాపాడు: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి దేవరాజు పేర్కొన్నారు. మండలంలోని చియ్యపాడు, లక్ష్మీపేట గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం దేవరాజు తనిఖీ చేశారు. ఇదే క్రమంలో పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డీఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనల మేరకూ చదువుకోవాలన్నారు. పరీక్షలనే భయం లేకుండా రాయాలన్నారు. అనంతరం లక్ష్మీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రవిశంకర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కడప అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి సాగును పెంచాలని ప్రకృతి వ్యవసాయ రాయలసీమ రీజియన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, నాబార్డు డీడీఎం విజయవిహారిలు సూచించారు. గురువారం కడప జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి విత్తన గుళికలు, పీఎండీఎస్ (ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, విజయవిహారి మాట్లా డుతూ చిరుధాన్యాల పంటల సాగుతో భూమిని 365 రోజులు కప్పివుంచే ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డీపీఎం రామక్రిష్ణ మాట్లా డుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ఇంటి వద్ద పెరటి తోటల పెంపకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ సురేంద్ర రెడ్డి, అడిషినల్ డీపీఎం వసంతకుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి.. కార్యాచరణతో కట్టడి

- నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించిన అధికారులు
- ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో సమస్య పరిష్కారానికి చర్యలు





కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎండలు రోజురోజుకు ముదురుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. ఇప్పుడే ఇలా ఉంటే....మే నాటికి సమస్య తీవ్రరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయి. మార్చి నుండి జూన్ వరకు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొనే గ్రామాలను అధికారులు గుర్తించారు. ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమేనని, తాగు నీటి సమస్య ఎదుర్కొనే గ్రామాల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదని గ్రామీణ నీటి సరఫరాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే గత సంవత్సరంతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడం వల్ల భూగర్భ జలాల లభ్యత తగినంతగా ఉండడమే ఇందుకు కారణమని విశ్లేషిస్తున్నారు. మనుషులు, పశువుల తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొనేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్–2023ను అధికారులు సిద్ధం చేశారు.

- జిల్లాలో 517 తీవ్ర నీటి ఎద్దడి గ్రామాలున్నాయని అధికారులు గుర్తించారు. ఇందులో 368 గ్రామాల్లోని ప్రజలకు 3,05,336 ట్యాంకర్ ట్రిప్పులు అవసరమవుతాయి. ఇందుకోసం రూ. 1586.98 లక్షలు కావాలన్నది అంచనా. ఇక 164 గ్రామాల్లో పశువుల కోసం 11,827 ట్రిప్పుల తాగునీరు రవాణా చేయాల్సి ఉంటుందని, ఇందుకు రూ. 61.5 లక్షలు అవసరమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. 60 గ్రామాల్లో వ్యవసాయ బోరు బావులను అద్దెకు తీసుకోవడానికి రూ.0.17 లక్షలు, 70 బోర్ల ఫ్లషింగ్‌కు రూ. 12.22 లక్షలు, 96 బోర్‌వెల్స్ డీపెనింగ్‌కు రూ. 67.6 లక్షలు కలిపి మొత్తం రూ.1728.4 లక్షలు అవసరమవుతాయని కంటింజెంట్ ప్రణాళికల్లో అధికారులు పేర్కొన్నారు.
- మార్చి నెలలో పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు, గోపవరం, అట్లూరు, బద్వేలు మండలాల్లోని 64 గ్రామాలు తాగునీటి సమస్య ఎదుర్కొనున్నాయి. ఇందులో 35 గ్రామాల్లో ప్రజలకు, 10 గ్రామాల్లో పశువులకు తాగునీటి రవాణా చేపట్టాల్సి ఉంటుంది. 12 చోట్ల బోరుబావుల ఫ్లషింగ్, 12 చోట్ల డీపెనింగ్ చేయాల్సి ఉంటుంది. మొత్తం ఇందుకు రూ. 102 లక్షలు అవసరం అవుతుందని అంచనా.
- ఏప్రిల్‌లో జమ్మలమడుగు, కొండాపురం, మైలవరం, ముద్దనూరు, పెద్దముడియం, ఎర్రగుంట్ల, చక్రాయపేట, రాజుపాలెం, బ్రహ్మంగారిమఠం, మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు, ఒంటిమిట్ట మండలాల్లో కూడా నీటి ఎద్దడి ఏర్పడనుంది. దీంతో సమస్యాత్మక మండలాల సంఖ్య 19కి చేరనుంది. ఈ మండలాల్లో 157 గ్రామాలను గుర్తించగా, అందులో 117 గ్రామాల్లోని ప్రజలకు, 60 గ్రామాల్లో పశువుల కోసం తాగునీటి రవాణా చేపట్టనున్నారు. 20 చోట్ల అద్దె బావులు, 39 చోట్ల బోర్‌వెల్స్ ఫ్లషింగ్, 35 చోట్ల డీపెనింగ్ పనులు నిర్వహించనున్నారు. ఇందుకోసం రూ. 465.32 లక్షలు అవసరవుతాయని అంచనా.
- మే నెలలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొనే మండలాల సంఖ్య 20కి, గ్రామాల సంఖ్య 166కు చేరుకోనుంది. ఇందులో 126 గ్రామాల్లో తాగునీటి రవాణాకు రూ 566.30 లక్షలు అవసరమవుతాయి. ఇక 60 గ్రామాల్లో పశువులకు తాగునీటి రవాణా చేపట్టేందుకు రూ. 25.61 లక్షలు అవసరం కానున్నాయి. ఈ గ్రామాల్లో 20 చోట్ల అద్దె బావులు, తొమ్మిదిచోట్ల బోరు బావుల ఫ్లషింగ్, 17 చోట్ల డీపెనింగ్ చేపట్టనున్నారు. వీటన్నింటికీ కలిపి రూ. 609.96 లక్షలు అవసరం అవుతాయి.
- జూన్‌లో 14 మండలాల్లోని 130 గ్రామాల్లో నీటి సమస్య ఉంటుందని అంచనా. ఇందులోని 90 గ్రామాల్లో ప్రజలకు, 34 గ్రామాల్లో పశువులకు తాగునీరు రవాణా చేయనున్నారు. ఈ గ్రామాల్లో 20 చోట్ల అద్దె బావులు, 10 చోట్ల బోర్‌వెల్స్ ఫ్లషింగ్, 16 చోట్ల డీపెనింగ్ పనులు చేపడతారు. వీటన్నింటికి రూ. 551.19 లక్షలు అవసరమవుతాయి.

మైలవరం నుంచి పెన్నానదికి నీటి విడుదల



పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్న ఈఈ వెంకటరామయ్య

మైలవరం (జమ్మలమడుగు రూరల్): మైలవరం జలాశయం ఈఈ వెంకటరామయ్య గురువారం ఉదయం జలాశయం నుంచి నీటిని పెన్నానదికి విడుదల చేశారు. ఈఈ వెంకటరామయ్య మాట్లాడుతూ రాబోవు వేసవికాలన్ని దృష్టిలో పెట్టుకుని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పట్టణాలకు, అలాగే పెన్నానది పరివాహ ప్రాంత 35 గ్రామాల ప్రజల తాగు, సాగునీటి కోసం నీటిని విడుదల చేశామన్నారు. ఒక గేట్ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని వదిలామని ఆయన తెలిపారు. మైలవరం జలాశయంలో ప్రస్తుతం 3.87 టీఎంసీల నీరు ఉందన్నారు. అవసరమయితే గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేయిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జలాశయం డీఈ నరసింహమూర్తి ఏఈఈ గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలి

కలెక్టర్ విజయ రామరాజు



సీఎస్ వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయ రామరాజు, జేసీ సాయికాంత్ వర్మ

కడప సిటీ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి హౌసింగ్, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగాలు, పీఆర్ అండ్ ఆర్ డి వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు , జాయింట్ కలెక్టర్ల తో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుండి కలెక్టర్ విజయ రామరాజు తో పాటు జేసీ సాయికాంత్ వర్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీసీ ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల తాగునీటి అవసరాలకు ఎలాంటి కొరత లేకుండా చూడాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి సాగుచేసిన పంటలకు ఈ–క్రాపింగ్, ఈ–కెవైసి 100 శాతం పూర్తి చేయాలన్నారు. అన్ని అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సంక్షేమ, సర్వే, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ ఎంపికలు



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని విద్యుత్‌భవన్‌లోని క్రీడామైదానంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ విభాగం ఫుట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. మహబూబ్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు పి.ఎస్. తిరుపాల్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా మహిళల జట్టును ప్రకటించారు.

జిల్లా మహిళల జట్టు : కె. వెన్నెల, జి.తనూజ, ఎస్. రేష్మ, పి.రామలక్ష్మి, సి.హెచ్.పూజిత, టి. అరుణ, కె. అనురాధ, ఎల్.శృతి, ఎస్.భానుశ్రీ, డి.నిరీక్షణ, కె. శ్రీదేవి, చంద్రవదన, ఎస్. అఖిల, ఎం.నందిని, ఎం.సావిత్రి, సి.సాయికళ, మేనేజర్ : కృష్ణవేణి

జాతీయ యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థుల ప్రతిభ

అభినందించిన వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల బెంగుళూరు నగరంలోని జైన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో విశ్వవిద్యాలయంలోని ఫైన్‌ఆర్ట్స్ విభాగం విద్యార్థులు బి.గంపమల్లయ్య శిల్పకళా విభాగంలో (స్వర్ణపతకం), ఫొటోగ్రఫీలో బి. పవన్‌కల్యాణ్ (స్వర్ణపతకం), వై. అరవింద్‌కార్టూన్ విభాగంలో (కాంస్యపతకం) సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను, ప్రోత్సహించిన అధ్యాపకులను వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగ జనార్దన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య గురువారం వైవీయూ వీసీ చాంబర్‌లో అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కల్చరల్ కో–ఆర్డినేటర్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, టీం మేనేజర్‌లు ఆచార్య జి. విజయ భారతి, డా. జి. కాత్యాయని, లలితకళల విభాగాధిపతి డా. కోట మృత్యుంజయరావు, అధ్యాపకులు డా. ఎస్.వి. సుబ్బారెడ్డి, వెంకటేష్, ఈరప్ప, చినరాయుడు, అప్పలాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

సమాజానికి మనోవిజ్ఞాన శాస్త్ర సేవలు అవసరం

ప్రస్తుత పరిస్థితుల్లో మనోవిజ్ఞానశాస్త్ర సేవలు సమాజానికి ఎంతో అవసరమని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్ధన పేర్కొన్నారు. గురువారం వైవీయూ మనోవిజ్ఞానశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో 'రీసెర్చ్ మెథడాలజీ అండ్ అనాలసిస్ యూజింగ్ ఎస్‌పీఎస్ఎస్' అన్న అంశంపై 5రోజుల వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వీసీ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీప్రపంచంలో ఒత్తిడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పలు సమస్యలకు సైకాలజీ నిపుణులు పరిష్కారం చూపాలని సూచించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రయోగాత్మక నైపుణ్యాలను నేర్పేందుకు ఇలాంటి వర్క్‌షాపులు దోహదం చేస్తాయన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్స్ డా. కె. లలిత, డా. లాజర్ వర్క్‌షాపు నిర్వహణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ డా. కన్నన్, డా. వెంకటాచలం, డా. జల్‌పాల్, డా. షమీవుల్లా, డా.లావణ్యకుమారి తదితరులు మాట్లాడారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

కడప స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కగా రాణించి చాంపియన్‌లుగా నిలవాలని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కంభం చిన్నపరెడ్డి కోరారు. కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ విభాగం జట్టును గురువారం ప్రకటించారు.

జిల్లా జట్టు:
ఎస్. చాంద్‌బాషా, జి. ఉదయ్‌కుమార్, ఎస్. అక్బర్, సి.మల్లికార్జున, బి.మురళీకృష్ణ, ఎస్. రజాక్, ఎస్. ఆదిశేషారెడ్డి, ఎన్. ఈశ్వర్, ఎస్. సుమిత్‌కుమార్‌రెడ్డి, బి.విక్రమ్‌కల్యాణ్, ఎస్. నాగేంద్ర, ఎం. మోహన్‌నాయక్, ఇ.వెంకటకృష్ణారెడ్డి, పి.ప్రసాద్, ఎం. గురువర్ధన్, బి.సాయికిరణ్.

ప్రమాదాల రహదారి

- కడప– రేణిగుంట రహదారిలో నిత్యం ప్రమాదాలే
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- హైవేలో ప్రయాణమంటేనే భయం
- తాజాగా కుక్కలదొడ్డి వరకు బ్లాక్‌స్పాట్స్ సర్వే
- ప్రమాదాల స్థితిగతులపై నివేదిక కోరిన వైఎస్సార్ జిల్లా కలెక్టర్



కడప-రేణిగుంట హైవే రోడ్డులోని బ్లాక్‌స్పాట్

రాజంపేట: కడప-రేణిగుంట హైవే ప్రస్తుతం బ్లాక్ స్పాట్స్(ప్రమాద స్థలాలు) హైవేగా కొనసాగుతోంది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదం జరుగుతోంది. జాతీయ రహదారంతా రక్తపు మరకలే కనిపిస్తున్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రెండు దశాబ్దాల క్రితం సింగిల్‌రోడ్డుగా ఉన్న రహదారిని వెడల్పు చేసి స్టేట్‌హైవే డబుల్ రోడ్డుగా మార్చారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రస్తుతం జాతీయ రహదారిగా ఈ రోడ్డు కొనసాగుతోంది.

హైవేలో ప్రయాణం.. భయం భయం..

ప్రస్తుతం హైవే వెంబడి ప్రయాణం చేయడమంటే భయం.. భయంగా వెళ్లాల్సి వస్తోంది. ఎటువైపు నుంచి ప్రమాదం పొంచి ఉందో తెలియని పరిస్థితి. కడప శివార్లలో జేఎంజే కళాశాల నుంచి భాకరాపేట సర్కిల్, మాధవరం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, మంగంపేట, రైల్వేకోడూరు, శెట్టిగుంట, కుక్కలదొడ్డి వరకు హైవేలో రహదారి ప్రయాణం కత్తిమీద సాములా మారింది. మార్గంలో అనేక ప్రమాదకర మలుపులున్నాయి. ఒంటిమిట్ట, నందలూరు, రెడ్డిపల్లె చెరువుకట్టలపై రహదారి ఉంది. అనేకమార్లు చెరువుల్లోకి కూడా వాహనాలు అదుపు తప్పిపడిన సంఘటనలు ఉన్నాయి.

యాత్రికులరోడ్డుగా..

దక్షిణభారతదేశం నుంచి తిరుమలకు కడప-రేణిగుంట మార్గం మీదుగా వేలాదిమంది యాత్రికులు వాహనాల ద్వారా చేరుకుంటున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు రాజస్థాన్, యూపీ తదితర రాష్ట్రాలనుంచి వేలాదిమంది యాత్రికులు ఈ మార్గంలోనే ప్రయాణం కొనసాగిస్తుంటారు. అయితే వీరి వాహనాలు అనేక సార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి.

పెరుగుతున్న ట్రాఫిక్..

కడప-రేణిగుంట హైవేలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గం మీదుగా తిరుపతి, చెన్నై, ముంబయి, హైదరాబాదు మధ్య రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం 17వేలకు పైగా వాహనాలు హైవేపై పరుగులు తీస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్‌కు హైవే సామర్థ్యం సరిపోవడంలేదు. ఫలితంగా ప్రమాదాలు, ట్రాఫిక్ స్తంభించిపోవడం లాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి.

ప్రత్యామ్నాయం.. గ్రీన్ ఎక్స్‌ప్రెస్ నేషనల్‌హైవే

పాత హైవేకి ప్రత్యామ్నాయంగా కేంద్రప్రభుత్వం గ్రీన్‌ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే రోడ్డు(716)ను తీసుకొచ్చింది. రూ.3వేల కోట్ల వ్యయంతో తక్కువ సమయంలో తిరుపతి చేరేలా 133 కిలోమీటర్ల దూరం హైవేను తీసుకొస్తున్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో రైలుమార్గానికి పడమర వైపు కొనసాగుతోంది. తిరుపతి, చెన్నై నగరాలకు త్వరగా చేరుకునేందుకు హైవే దోహదపడుతుంది. అంతేగాకుండా భారీ వాహనాలు, దక్షిణ భారతదేశాల నుంచి వచ్చే యాత్రికుల వాహనాలు కొత్త నేషనల్‌హైవే మీదుగా వెళ్లనున్నాయి. ఫలితంగా కడప-రేణిగుంట పాతరోడ్డులో ట్రాఫిక్ తగ్గిపోయి, ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని అధికారులు అంటున్నారు. కొత్త హైవే నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారు.

కుక్కలదొడ్డి వరకు బ్లాక్‌స్పాట్ సర్వే

కడప-రేణిగుంట నేషనల్ హైవేలోని జిల్లా సరిహద్దు ప్రాంతమైన కుక్కలదొడ్డివరకు బ్లాక్‌స్పాట్స్‌పై సర్వేను అధికారుల బృందం నిర్వహించారు. ఇందులో రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్,. ఎన్‌హెచ్ డీఈ రామకృష్ణనాయక్, సీఐ పుల్లయ్య ఉన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ఉన్న రోడ్డు పరిస్థితులు తదితర అంశాలపై సర్వే చేపట్టారు. సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నారు. ఇటీవల ప్రమాదాలు అధికంగా జరుగుతున్న క్రమంలో కలెక్టర్ హైవేలో రాకపోకల స్థితిగతులపై నివేదిక కోరినట్లు సమాచారం.

ప్రతి చోట బ్లాక్‌స్పాట్స్..



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

కడప-రేణిగుంట హైవేలో ప్రతి మండల పరిధిలో బ్లాక్‌స్పాట్స్(ప్రమాద స్థలాలు)ను గుర్తించారు. రాజంపేట అర్బన్‌లో 3, నందలూరు 2, , రైల్వేకోడూరు 3, పుల్లంపేట 3 ఓబులవారిపల్లి 6, మన్నూరు 3తో పాటు అలాగే ఒంటిమిట్ట, మాధవరం, భాకరాపేటలో కూడా ప్రమాదానికి దారితీసే ప్రాంతాల్లో నివారణ చర్యలను చేపట్టారు. ప్రత్యేక బృందాలు సర్వే చేసి కడప-రేణిగుంట మార్గంలోని హైవేపై ప్రమాదాలు జరుగుతున్నాయని నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలో పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పెద్దాసుపత్రిలో ట్రామా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు.

ప్రతి పశువుకు గాలికుంటు వ్యాక్సిన్ వేయించాలి

వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా పశువైద్యాధికారి



ఎద్దుకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్ వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్: జిల్లాలో ఉన్న రైతులందరు తమ పశువులు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు నివారణకు వ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలని జిల్లా పశువైద్యాధికారి శారదమ్మ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాకు ముందస్తుగా 4,00,679 డోసులు మంజూరయ్యాయన్నారు. జిల్లావ్యాప్తంగా 43,409 ఆవులు, 3,91,503 పశువులు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటికీ తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఇందులో భాగంగా గురువారం సికెదిన్నె మండలంలో ఎద్దులు, ఆవులకు వ్యాక్సిన్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి పశువులు, ఆవులకు సోకితే చాలా ప్రమాదం అన్నారు. ఈ వ్యాధి సోకకుండా ఉండేందుకు ముందుగా తప్పకుండా ప్రతి ఒక్కరూ తమ పశువులు, ఆవులకు తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ లక్ష్మిదేవి, సికెదిన్నె మండల పశువైద్యాధికారులు డాక్టర్ ప్రమోద్, డాక్టర్ అనుపమ, సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 264 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపిన వారిపై గురువారం 264 కేసులను నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలను నడిపిన వారిపై 212, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహనాల డ్రైవర్లపై 52 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ఇందుకూరు గంగరాజును పోలీసులు పట్టుకున్నారు. అతని వద్దన ఉంచి పది బస్తాలను (600 కిలోల బియ్యం) స్వాధీనం చేసుకున్నట్లు ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. వేంపల్లె మండలం పరిధిలోని ముతుకూరు గ్రామానికి చెందిన ఇందుకూరు గంగరాజు ఎర్రగుంట్ల ప్రజలకు మాయ మాటలు చెప్పి రేషన్ బియ్యం తీసుకుని ప్రొద్దుటూరులోని ఓ వ్యక్తికి అమ్మడానికి వెళుతుండగా వినాయకనగర్ కాలనీ సమీపంలో పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.30లక్షల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు, కారుతో సీఐ నరసింహారావు

రాజంపేట : రాజంపేట–నెల్లూరు రహదారిలోని పొలిచెరువుకట్టపై ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేస్తుండగా గురువారం చెన్నైకి చెందిన వారి కారులో రూ.30లక్షలు నగదు పట్టుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ నరసింహారావు విలేకర్లతో మాట్లాడుతూ టీఎన్05సీసీ7799 నంబరు గల వాహనంలో చెన్నైకి చెందిన వెంకటరమణ, మరో ముగ్గురు కలిసి రాజంపేటకు చెందిన వ్యక్తి వద్ద స్థలం కొనడానికి రూ.30లక్షల నగదును తీసుకువస్తున్నట్లు తెలిపారన్నారు. సరైన పత్రాలు లేనందున పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నగదను ఫ్లయింగ్‌స్క్వాడ్‌కు అప్పగించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నరసింహులు, స్పెషల్‌ఫోర్స్ తదితరులు పాల్గొన్నారు.

కంచె బలి తీసుకుంది


మృతి చెందిన కణితి

సిద్దవటం : అటవీ ప్రాంతం నుంచి గ్రామ శివారులోకి వచ్చిన కణితి మృతి చెందినదని రేంజర్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అడవీ ప్రాంతం నుంచి కణితి సిద్దవటంలోని జగనన్న కాలనీకి సమీపం లోకి వచ్చింది. అక్కడ పొలాలకు సంబంధించిన కంచె దాటే ప్రయత్నంలో కింద పడి పరిగెత్తలేక పోయింది.స్థానికులు తమకు సమాచారం ఇచ్చారు.ఈలోగా వారు కణితిరు నీరు తాపారు. సంఘటనా స్థలానికి సిబ్బంది వెళ్లిన కొద్దిసేపటికే కణితి మృతి చెందిందని రేంజర్ ప్రసాద్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కణితికు సిద్దవటం పశువైద్య శాలలో పోస్టు మార్టరం నిర్వహించి సాబ్‌బావి బేస్ క్యాంపు అటవీ ప్రాంతంలో ఖననం చేశామని రేంజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేస్, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలే శ్రీరామరక్ష

- వేసవి ప్రారంభంలో సంక్రమించే చికెన్‌పాక్స్
- చిన్న పిల్లల్లో ఎక్కువగా కనిపించే ఆటలమ్మ
- నాటు పద్ధతులకు దూరంగా ఉండాలంటున్న వైద్యనిపుణులు


జిల్లా ఆస్పత్రిలో పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు


ఆటలమ్మ సోకిన బాలుడు

ప్రొద్దుటూరు క్రైం/కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవికాలం వస్తోందంటే చాలు చికెన్‌పాక్స్ సమస్య మొదలవుతుంది. ఈ వ్యాధి సోకిన పసి పిల్లలు పడే బాధలు అన్నీఇన్నీ కావు.చికెన్‌పాక్స్‌ను ఆటలమ్మ.. చిన్న అమ్మవారు అని కూడా అంటారు. ఆటలమ్మ గ్రామాలతో పాటు పట్టణాల్లో కూడా విజృంభిస్తోంది.ఇది అంటువ్యాధి. వరిసెల్లా జోస్టర్ అనే వైరస్ క్రిముల ద్వారా సంక్రమిస్తుంది. సాధారణంగా 10 ఏళ్ల వయసు లోపు పిల్లలే ఎక్కువగా ఆటలమ్మకు గురవుతుంటారు. ఈ వ్యాధి బారిన పడిన వ్యక్తులు మాట్లాడేటప్పుడు, దగ్గినా, తుమ్మినా అతని నోటి నుంచి వెలువడే లాలాజల తుంపర్ల ద్వారా ఈ వ్యాధికారక క్రిములు ఎదుటి వారికి సంక్రమిస్తాయి. ఆటలమ్మ లక్షణాలు కనిపించడానికి 24 గంటలు ముందు నుంచే ఈ వ్యాధి కారక క్రిములు ఆ రోగి నుంచి ఎదుటి వారికి సంక్రమించే అవకాశాలుంటాయి.

ఒంటి మీద ఆటలమ్మ దద్దుర్లు ఏర్పడి అవి పొక్కులు కట్టడానికి 6,7 రోజులు పడుతుంది. అప్పటి వరకు ఆ రోగి నుంచి ఈ వ్యాధి ఇతరులకు సంక్రమించే అవకాశం ఉంటుంది. ఆ పొక్కుల ద్వారా మాత్రం ఈ వ్యాధి ఇతరులకు రాదు. చికెన్‌పాక్స్‌తో బాధపడే పిల్లల వద్దకు వెళ్లిన పెద్దలకు మాత్రం ఈ వ్యాధి రాదు. మొదటి దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. ఈ దశలో రోగి వల్ల ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందదు. రెండో దశ 24–48 గంటలు ఉండి జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం మొదలైన రెండు, మూడో రోజున ఎర్రటి పొక్కులు ముందుగా మొహం, ఛాతి, వీపుపై మొదలై రెండు, మూడు రోజుల్లో కాళ్లు, చేతులకు కూడా వ్యాపిస్తాయి. పొక్కులు మొదట ఎర్రగా, చిన్నగా ఉండి, రెండు, మూడు రోజుల్లో నీటి బుడ్లలా మారుతాయి. నీటి తిత్తి చుట్టూ చర్మం ఎర్రగా కమిలి ఉంటుంది. కళ్లు, పెదవులు, నోటిలోపల, జననేంద్రియాలపై కూడా ఈ నీటి పొక్కులు వస్తాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి నుంచి ఉపశమనం పొందొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. బట్టలు శుభ్రంగా ఉంచుకోవాలి.
- జ్వరానికి వైద్యులు సూచించిన మోతాదులో పారాసెటమాల్ మాత్రలను వాడాలి.
- దురదకు కాలమైన్ లోషన్ వాడుకోవచ్చు. వైద్యుల సలహాపై యాంటీ హిస్టమిమ్ మందులను వాడాలి. పిల్లలు గోర్లతో గిల్లుకునే అవకాశం ఉంది కాబట్టి వారి గోర్లను కత్తిరిస్తే మంచిది. మరీ చిన్న పిల్లలైతే పలుచని బట్టతో చేతులకు చుట్టేయాలి.
- తేలికపాటి, త్వరగా జీర్ణమయ్యే బలవర్ధకమైన ఆహారాన్ని పిల్లలకు తినిపించాలి.
- ఇంట్లో ఒకరికి చికెన్‌పాక్స్ వచ్చినసమయంలో ఇది వరకు ఈ వ్యాధి రానివారు రోగికి దూరంగా ఉండాలి.
- ప్రమాద లక్షణాలపై కనీస అవగాహన కలిగి ఉండాలి.సత్వర వైద్యం చేయించాలి.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి

చికెన్‌పాక్స్ వ్యాధి విషయంలో నాటు పద్ధతులు, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఆటలమ్మ సోకిన పిల్లలను వేపాకులపై పడుకోబెట్టడం, పసి పిల్లలకు పాలు ఇవ్వకపోవడం, పసుపు, వేపాకు ముద్దలు తినిపించడం, నూనె తాగించడం, పోషకాహారం ఇవ్వకుండా చప్పిడి తిండి పెట్టడం, స్నానం చేయించకపోవడం లాంటి వింత పోకడలను చాలా ప్రాంతాల్లో మనం చూస్తున్నాం. రోజుల తరబడి స్నానం చేయించకపోవడం వల్ల నీటి బుడ్డలో బ్యాక్టీరియా చేరి రోగి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది. పసుపు యాంటి సెప్టిక్‌లా పని చేస్తుంది కానీ దురద నుంచి ఉపశమనం ఇవ్వదు.

వీరిలో ఇన్‌ఫెక్షన్ ప్రమాదకరం

- సహజ రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు
- నెలల వయస్సు పిల్లల్లో..
- గర్భిణులు (మొదటి నాలుగైదు నెలల్లో చికెన్‌పాక్స్ వస్తే పిండంపై దుష్ప్రభావం ఉండొచ్చు)
- క్యాన్సర్లు, ట్రాన్స్‌ప్లాంట్ లాంటి సమస్యలకు చికిత్స పొందుతున్న వారు
- హెచ్ఐవీ రోగులు

ఆటలమ్మ వ్యాధి లక్షణాలు

- ముఖం, వీపు, ఛాతి భాగంలో దురదతో కూడిన ఎర్రగా వచ్చే చర్మవ్యాధి ఇది.
- నీటితో కూడిన బొబ్బలు వస్తాయి.
- ఈ లక్షణాలకు ముందు 2 రోజులు ముందు తేలిక పాటి దగ్గు, జలుబు, జ్వరం, తలనొప్పి, నీరసం, ఆకలి తగ్గుట, తేలికపాటి కడుపునొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఎలా వ్యాపిస్తుందంటే..

- ఆటలమ్మతో బాధ పడుతున్న వ్యక్తిని ఆరోగ్యంగా ఉన్న వారు తాకినా, వారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వైరస్ క్రిములు గాలి ద్వారా ఎదుట ఉన్న వారిలో ప్రవేశించి జలుబు చేస్తుంది. ఇది ఒకరి నుంచి ఇంకొకరికి సోకే అంటువ్యాధి.
- చర్మంపై లక్షణాలు కనిపించకముందు రెండు రోజుల నుంచి దద్దుర్లు పూర్తిగా మాని మచ్చలుగా మారేంత వరకు ఈ క్రిములు ఆరోగ్య వంతులకు సోకే అవకాశం ఉంది.
- చిన్న పిల్లలు, యుక్త వయస్సు వారిలో ఈ వ్యాధి ఎక్కువ శాతం వస్తుంది. చిన్న పిల్లలు సంరక్షణ సంస్థలు, పాఠశాలలు, మురికి వాడల్లో వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది.

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

ఆటలమ్మ సోకిన బాధిత పిల్లలతో జిల్లా ఆస్పత్రి, ప్రొద్దుటూరు, కడపతో పాటు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిట లాడుతున్నాయి. ఈ వ్యాధి సోకిన వారికి ఆస్పత్రుల్లో అడ్మిట్ చేయాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు. వైద్యుల సూచనలను పాటిస్తూ మందులను వాడితే పూర్తిగా నయమవుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా 7–10 రోజుల పాటు హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. జిల్లా ఆస్పత్రికి ప్రతి రోజు 20–30 మంది వరకు చికెన్‌పాక్స్ సోకిన వారు వస్తున్నారు. ఈ వ్యాధికి సంబంధించిన మందులు జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు.

చికెన్‌పాక్స్‌తో భయం వద్దు



“ చికెన్‌పాక్స్ (ఆటలమ్మ) వ్యాధి పట్ల భయపడొద్దు. ఇది వేసవి కాలంలో పిల్లలకు వచ్చే సాధారణ వైరస్‌తో కూడిన అంటువ్యాధి. దీని నుంచి పూర్తిగా కోలుకోవడానికి 10 నుంచి 15 రోజులు పడుతుంది. ఏడాది వయస్సు కలిగిన పిల్లలకు వెరిసెల్లా అనే వ్యాక్సిన్‌ను తప్పకుండా వేయించాలి. ఆటలమ్మ సోకిన వారికి ఎక్కువగా గ్లూకోజ్ నీరు, టెంకాయనీళ్లు తాగించాలి. కారం, మసాలలతో కూడిన ఆహారాన్ని ఇవ్వరాదు.

– డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు.

చీటింగ్ కేసులో రెండేళ్ల జైలు

కడప అర్బన్ : కడపలోని శంకరాపురానికి చెందిన దోగా యుగంధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు శంకరాపురానికి చెందిన కోలా మల్లికార్జునపై క్రైమ్ నంబర్. 350/2019 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 2006లో నిందితుడు కోలా మల్లికార్జున కడపలోని ఏడురోడ్ల వద్ద ఉన్న ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో ఓడీగా చిన్నచౌక్ పరిధిలోని రాజాజీనగర్‌లో ఉన్న 19 సెంట్ల స్థలాన్ని బ్యాంకు వారికి తనఖా పెట్టి రూ. 10లక్షలు డబ్బులు తీసుకున్నాడు. తర్వాత నిందితుడు సదరు ఓడీ విషయమై బ్యాంకు వారికిగానీ, ఫిర్యాదితో కానీ తెలుపకుండా నకిలీ డాక్యుమెంట్లను తయారు చేశాడు. అతని స్నేహితుల వద్ద నుంచి సుమారు రూ. 50 లక్షలు డబ్బులను తీసుకుని ఫిర్యాదికి, అతని స్నేహితులకు నకిలీ డాక్యుమెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి మోసం చేశారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నచౌక్ ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గురువారం కడప రెండో అదనపు మెజిస్ట్రేట్ షేక్ రియాజ్ బాషా కేసును విచారించి నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2100 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పద్మావతి వాదించారు. ఈ కేసును త్వరితగతిన పూర్తి చేసినందుకు చిన్నచౌక్ పోలీసు అధికారులను, కోర్టు మానిటరింగ్ సెల్‌లోని అధికారులను, సిబ్బందిని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

భర్త కోసం మౌన పోరాటం


భర్త ఇంటి ఎదురుగా దీక్ష చేస్తున్న భాగ్యలక్ష్మి

రాయచోటిటౌన్ : వాళ్లిద్దరిదీ అన్యోన్య దాంపత్యం.. వాళ్ల సంసారం రేండేళ్లపాటు సజావుగా సాగింది.తర్వాత మనస్పర్ధలు ప్రారంభమయ్యాయి. సర్దిచెప్పాల్సిన అత్తమామలు కూడా పట్టించుకోలేదు. దీంతో ఆ అభాగ్యురాలు మూడేళ్ల నుంచి పుట్టింట్లోనే ఉంటోంది. ఇప్పుడు నా మొగుడు నాక్కావాలంటూ మౌనపోరాటానికి దిగింది. ఆమెకు స్థానిక మహిళలు అండగా నిలిచారు. బాధితరాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామం కస్పాకు చెందిన లక్ష్మిదేవి, శ్రీనివాసులు కుమార్తె అయిన భాగ్యలక్ష్మి(24)ని పక్కనే ఉన్న రమణ (బంకు రమణ) పెద్ద కుమారుడు కె. శరస్‌కుమార్‌కి ఇచ్చి ఐదేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి మూడు సంవత్సరాల నిఖిత్ అనే కుమారుడు ఉన్నాడు. వీరి మధ్య మూడు సంవత్సరాల కిందట కలహాలు రేగాయి. దీంతో ఆమె దగ్గర్లోని పుట్టింటికి వెళ్లింది. తర్వాత గ్రామానికి చెందిన పెద్ద మనుషులు సర్దిచెప్పేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. విఫలం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా మూడు సార్లు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాపురానికి తీసుకెళ్లాలని సూచించారు. పెద్ద మనుషులు దగ్గర మాత్రం తనకు గడువు ఇస్తే కాపురానికి తీసుకెళతానని శరస్‌కుమార్ చెప్పేవాడు. భాగ్యలక్ష్మి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడం.. అక్కడ మళ్లీ కౌన్సెలింగ్ ఇవ్వడం.. అక్కడ మళ్లీ శరస్‌కుమార్ గడువు కావాలని కోరడం షరా మామూలుగా మారింది. మధ్యలో తన తమ్ముడికి పెళ్లి చేస్తున్నానని, వివాహం అయిపోగానే తన భార్యను కాపురానికి తీసుకెళతానని శరస్‌కుమార్ చెప్పేవాడు. తర్వాత పట్టించుకోకుండా ఉండేవాడు. దీంతో గ్రామంలోని పెద్ద మనుషులను పంచాయితీ కోసం పంపారు. అయినా ప్రయోజన లేకపోయింది.దీంతో గురువారం ఉదయం భాగ్యలక్ష్మి తన బిడ్డతో కలిసి భర్త ఇంటి ఎదురుగా 'నా భర్త నాకు కావాలంటూ' మౌన పోరాటానికి పూనుకుంది. తన భర్త కాపురానికి తీసుకెళ్లాలని, లేకపోతే ఇక్కడే బిడ్డతో పాటు ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. దీంతో గ్రామంలోని పెద్ద మనుషులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్ పోలీసులు రంగ ప్రవేశం చేసి అక్కడ జరిగిన సంఘనపై స్థానికులు, బాధితులతో కలసి విచారణ సాగించారు. ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌కు రావాలని, అక్కడ కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని నిలబెడతామని, లేకపోతే నిందితుడిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు. దీంతో ఇరువర్గాల పెద్దలు పోలీస్ స్టేషన్‌కు చేరారు.

108 వాహనంలో ప్రసవం


తల్లీబిడ్డతో ఈఎంటీ కొండయ్య

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలికి చెందిన శివమ్మ 108 వాహనంలోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం తెల్లవారుజామున పెద్దచెప్పలికి చెందిన చెప్పలయ్య తన భార్య శివమ్మకు పురిటి నొప్పులు వచ్చాయని 108కు కాల్ చేశాడు. వెంటనే ఈఎంటీ కొండయ్య, పైలట్ ప్రదీప్ రెడ్డి పెద్దచెప్పలికి చేరుకున్నారు. శివమ్మను కమలాపురం సీహెచ్‌సీకి అంబులెన్స్‌లో తీసుకొస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో వాహనం ఆపి ఈఎంటీ ప్రసవం చేశారు. రెండోకాన్పులో శివమ్మ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారు.చికిత్స నిమిత్తం వారిని కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చెప్పలయ్య 108 సిబ్బందికి, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలి

కమలాపురం : కమలాపురం మండలం సంబటూరు సచివాలయం పరిధిలోని చెన్నంపల్లె గ్రామ వలంటీర్ నాగేశ్వర్‌రెడ్డి పై చర్యలు తీసుకోవాలని సంబటూరు గ్రామ నాయకుడు ఎల్లారెడ్డి ఎంపీడీఓ చలపతిని కోరారు. గురువారం వలంటీర్ తన కుటుంబంలోనే ఏడుగురికి వికలాంగ పింఛన్లు మంజూరు చేయించుకున్న ఆధారాలను ఎంపీడీఓకు అందజేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని, తన పరిధిలో లేకుంటే ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ వివరణ ఇచ్చారు.

రాముల వారికి వెండి ఆభరణాలు సమర్పణ


ఆలయ అధికారులకు వెండి ఆభరణాలను అందజేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన సీతారామలక్ష్మణ మూర్తులకు గురువారం గుడివాడ స్వర్ణలత అనే మహిళ వెండి ఆభరణాలను సమర్పించినట్లు ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశయ్య తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా, దాన్వాయిపేటకు చెందిన గుడివాడ స్వర్ణలత దాదాపు 4 లక్షల విలువ గల 5 కేజీల 382 గ్రాముల వెండి గొడుగులు, సీతారామలక్ష్మణ, హనుమంత స్వాముల ముద్ర కల్గిన వెండి పథాకాన్ని సమర్పించారు. ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అధికారులకు అందజేశారు.

13 మంది జూదరుల అరెస్టు

– రూ. 52,300 స్వాధీనం

జమ్మలమడుగు రూరల్ : మండలపరిధిలోని పర్యాటక ప్రాంతమైన గండికోటలో జూదమాడుతున్న 13 మందిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ సదాశివయ్య కథనం మేరకు గురువారం గండికోట ప్రాంతంలో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి నిర్వహించామన్నారు. 13 మంది అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ. 52,300, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పీవీ శివారెడ్డి ఏకగ్రీవం


శివారెడ్డిని సన్మానిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పల్లె వెంకట శివారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల విజయవాడలో రాష్ట్ర కమిటీ తీర్మానం చేసి మూడోసారి ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్ఎంయూ కడప జోనల్ సెక్రటరీ సుధాకర్ తెలిపారు. గురువారం శివారెడ్డిని యూనియన్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ శివారెడ్డి కడప జోన్‌లో డివిజనల్, రీజినల్, జోనల్, రాష్ట్ర కార్యదర్శులుగా కార్మికులు, ఉద్యోగులకు అనేక సేవలు అందించాన్నారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే అధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ రామిరెడ్డి, ప్రెసిడెంట్ నాగముని, కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు జయరాం, సగినాల శ్రీనివాసులు, రీజినల్ నాయకులు ఆర్.నారాయణ, దాస్, ప్రభాకర్, రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదిలో వ్యక్తి గల్లంతు

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మండలంలోని వేపరాల గ్రామం వద్ద ఉన్న పెన్నానదిలో కుమ్మరి శేఖర్ (52) అనే వ్యక్తి గల్లంతయ్యాడు. మైలవరం ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు వేపరాల గ్రామానికి చెందిన కుమ్మరి శేఖర్ కూలీపనులు చేసుకుంటూ జీవించేవాడు. గురువారం నాపరాయి గనుల్లో పని చేశాక తిరిగి స్వగ్రామానికి వెళ్లటానికి వేపరాల బ్రిడ్జి దాటుతుండగా నీటిలో జారి పడ్డాడు. అతని చేతిలో ఉన్న క్యారియర్ నీటి గుంతలో పడింది. క్యారియర్‌ను తీసుకునేందుకు నీటిలో దిగాడు. కాగా పెన్నానదికి నీరు వదలడంతో గుంతలో నీరు ఎక్కువ ఉన్నాయి. దీంతో గల్లంతయ్యాడు. రాత్రి 10 గంటల వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు.తిరిగి శుక్రవారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రంలో 3000 కొత్త ఆలయాల నిర్మాణం


జ్వాలాపురం శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్రంలో కొత్తగా 3000 ఆలయాలు నిర్మాణ దశలో ఉన్నాయని రాష్ట్ర దేవదాయ శాఖ ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ తెలిపారు.గురువారం పట్టణంలోని ముజంగేశర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒక్కో ఆలయానికి రూ. 10లక్షలు ఖర్చు పెట్టి 3వేల దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఇప్పటికే 936 ఆలయాల నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. అర్చకుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రీసర్వే జరిపి దేవాలయాల భూములు కాపాడుతామన్నారు. కార్యక్రమంలో అధికారి సుదీప్‌రెడ్డి, త్రివిక్రమ్, బ్రాహ్మణ నాయకులు ఓరుగంటి అనీల్‌కుమార్, కోసంగి శ్రీకాంత్, దూర్జటియోగి, వెన్నెలకంటి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో రైలు ఢీకొని ప్రవాసాంధ్రుడు మృతి

పీలేరు రూరల్ : అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ఒకరు అమెరికాలో దుర్మరణం పాలయ్యారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం కోడి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగి విజయకుమార్ రాజు, సరళ దంపతుల కుమారుడు శ్రీకాంత్‌రాజు (40) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఆరేళ్ల నుంచి న్యూజెర్సీలో పని చేస్తున్నారు. ప్రతి రోజూ తన ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లేందుకు లోకల్ ట్రైన్‌లో ప్రయాణించేవాడు. ఈ నేపథ్యంలో అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం రైల్వే స్టేషన్‌లో రైలు ఢీకొనడంతో శ్రీకాంత్‌రాజు మృతి చెందినట్లు స్నేహితులు సమాచారం అందించారు. శ్రీకాంత్‌రాజు మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.